క్లుప్తంగా

వెంకయ్యస్వామి ఆరాధన


వెంకయ్యస్వామికి పూల అలంకరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం లోని వెంకయ్య స్వామి ఆశ్రమంలో శనివారం భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, పూల, దీప అలంకరణ నిర్వహించారు. అనంతరం అష్టోత్తర పూజ, అగ్నిహోత్ర సహస్రనామ పూజ, 10 గంటలకు భజన, రామకృష్ణ మాస్టారుచే సత్సంగము నిర్వహించినట్లు వెంకయ్యస్వామి ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అనంతరం 12 గంటలకు స్వామివారి హారతి, అన్నసమారాధన నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకయ్యస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నట్లు తెలిపారు.

పారిజాతగిరిలో పూజలు


ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. తాడువాయికి చెందిన ఉప్పునూతల వెంకటేశ్వర రావు, శ్రీలత దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి మాణికల రాంబాబు పర్యవేక్షించారు.

మానవత ఆర్థిక సాయం


మహిళకు ఆర్థిక సాయం చేస్తున్న దిలీప్

కొయ్యలగూడెం: అరిపాటి (కనకాద్రిపురం)కి చెందిన ఎస్‌కే గౌసుల్జామ్ పేగుకి రంధ్రాలు పడడంతో వైద్యం చేయించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉంది. ఆమె పరిస్థితి తెలుసుకున్న మానవత సంస్థ ముందుకువచ్చి కొయ్యలగూడెంకి చెందిన సురక్ష హాస్పిటల్ అధినేత దిలీప్ ద్వారా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసింది. లక్షల రూపాయలు ఖర్చు అయ్యే వ్యాధితో బాధపడుతున్న ఆమె వైద్యానికి దాతలు సహకరించాలని, సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రజాప్రతినిధులు సహకరించాలని ఈ సందర్భంగా మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరు సుధీర్, కార్యదర్శి కంభంపాటి సాయి, కోశాధికారి ఎం.ఉమామహేశ్వరరావు, సభ్యులు కోరారు.

పరామర్శ


రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం జీలుగుమిల్లి వైస్ ఎంపీపీ రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల రాంబాబు మాతృమూర్తి మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పశుసంవర్ధక శాఖ డీడీ పర్యటన


యర్రంపేటలో గొర్రెల పెంపకందారులతో మాట్లాడుతున్న డీడీ చంద్రశేఖర్

కొయ్యలగూడెం: పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కె.చంద్రశేఖర్ శనివారం కొయ్యలగూడెంలోని పశువైద్యశాలలను, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను సందర్శించారు. యర్రంపేటలో పశువైద్యకేంద్రాన్ని సందర్శించి గాలికుంటు వ్యాధి టీకాలు, పశుకిసాన్ క్రెడిట్ కార్డుల దరఖాస్తుల ప్రగతి, పశుగ్రాస క్షేత్రాలు, మినీ గోకులం గురించి అధికారులతో చర్చించారు. పరింపూడి, వేదాంతపురం, కన్నాపురం పశువైద్యశాలలను సందర్శించారు. కొయ్యలగూడెం పశుసంవర్ధకశాఖ అధికారి బీఆర్ శ్రీనివాస్, ఎఎస్‌వీ శేఖర్ దొర, ఎం.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: లయన్స్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకాతిరుమలలోని వాసవీ ప్యారడైజ్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు కొఠారు వెంకట నరసింహారావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో సంతాన లేమి, స్త్రీ సంబంధిత, అధిక బరువు, గర్భిణీ స్త్రీలకు, థైరాయిడ్, గర్భకోశ సమస్యలకు వైద్యులు చికిత్స అందిస్తారని చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి



కామవరపుకోట: కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటన దేశంలో మహిళల భద్రత లోపాన్ని తెలియజేసింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. మహిళలపై జరిగే దారుణాలు అరికట్టడానికి ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. నిత్యం 24/7 సేవలు అందించే వైద్యులు, వైద్య సిబ్బందికి సంబంధించి సెంట్రల్ ఆరోగ్య భద్రత చట్టంను అమలుచేయాలి. ఆసుపత్రిలో కనీస వసతి, భద్రత సదుపాయాలు, మంచి లైటింగ్, సెక్యూరిటీ, సీసీ కెమెరాలు వంటివి ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ శ్రీసుమ, ప్రభుత్వ వైద్యాధికారి, తడికలపూడి, కామవరపుకోట మండలం

సెంట్రల్ ప్రొటెక్షన్ లా అభివృద్ధి చేయాలి



జంగారెడ్డిగూడెం: రోగుల వద్ద ఉండేందుకు, రోగులను చూసేందుకు ఎక్కువ మంది వస్తుంటారు. ఎవరు ఏ ఉద్దేశంతో వస్తుంటారో తెలియదు. ముఖ్యంగా క్రిటికల్ కేర్ సమయంలో వైద్యులు ఎంతో సంయమనంతో వ్యవహరిస్తూ వైద్యసేవలు అందిస్తున్నాం. అయినప్పటికీ ఏదో ఒక అలజడితో వైద్యులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మహిళా వైద్యులు మరింతగా ఇబ్బందులు పడుతున్నారు. కుల, మత, వర్గాలకు అతీతంగా ఆరోగ్య పరిరక్షణకు కృషిచేసే వైద్యుల రక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి. సెంట్రల్ ప్రొటెక్షన్ లాను మరింత అభివృద్ధి చేయాలి. కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ కాకర్ల రామచంద్రబాబు, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి, జంగారెడ్డిగూడెం

శాంతిభద్రతలే ధ్యేయం

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం.. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటాం.. అంటున్నారు బదిలీపై వచ్చిన కొత్త ఎస్సైలు. శనివారం కొయ్యలగూడెం, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, ధర్మాజీగూడెంలో కొత్త ఎస్సైలు బాధ్యతలు స్వీకరించారు.

సమస్యల పరిష్కారానికి నేరుగా సంప్రదించండి



కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ఎస్సైగా వర్రే చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, చేబ్రోలు, జీలుగుమిల్లి, నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఎస్సై చంద్రశేఖర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, సమస్యల పరిష్కారానికి నేరుగా తనను సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం



టి.నరసాపురం: టి.నరసాపురం ఎస్సైగా ఎం.జయబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. తడికలపూడి ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా టి.నరసాపురం వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై జయబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు. ముఖ్యంగా పేకాట , జూదాలు, అక్రమ మద్యం, అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై దుర్గామహేశ్వరరావు బదిలీపై బుట్టాయగూడెం వెళ్లారు.

నిబంధనలు అతిక్రమిస్తే సహించం



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎస్సైగా షేక్ జబీర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై జ్యోతిబాస్ ఏలూరు వీఆర్‌కు వెళ్లారు. జబీర్ తూర్పుగోదావరి, కృష్ణాజిల్లాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఎస్సై జబీర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటానని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని తెలిపారు.

విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తా



లింగపాలెం: లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎస్సైగా వెంకన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్సై వెంకన్న మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తానని అన్నారు. అలాగే స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ సుధాకర్‌ను ఎస్సై వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

నేడు అంకమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవం


అంకమ్మ తల్లి

లింగపాలెం: ములగలంపాడులో వేంచేసియున్న అంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి పూజ, అమ్మవారికి కుంకుమ పూజ, పాలు పొంగళ్ళు కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం అన్నసమారాధన జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు. రాత్రి 7గంటలకు చిన్నారులచే కోలాట ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కాగా అన్నసమారాధనకు సహకరించు దాతలు 94419 64518 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 3.13 లక్షల విరాళం


దాత రత్న సంపత్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేరువేరుగా శనివారం రూ. 3,13,348 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ఏలూరుకు చెందిన కలగర రత్న సంపత్ రూ. 1,11,116, భీమవరంకు చెందిన కలిదిండి రామచంద్రరాజు రూ. 1,01,116, నిడమర్రు మండలం భువనపల్లికి చెందిన శంకు వీరవెంకట దుర్గాప్రసాద్ రూ. 1,01,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

కృష్ణాష్టమి వేడుకలు

కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకుని పాఠశాలల, ఆలయాలు వద్ద రాధాకృష్ణుల వేషధారణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి అలరించారు. కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులకు మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు వీఎస్ఎన్ స్వామి బహుమతి ప్రదానం చేశారు. ఆదివారం కొయ్యలగూడెం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి తెలిపారు.

సీతారామనగరంలో వైద్యశిబిరాలు నిర్వహించాలి

కుక్కునూరు: సీతారామనగరంలో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వెంటనే ప్రభుత్వం వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ నాయకులు సీతారామనగరంలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ, గత వారంరోజులుగా గ్రామంలో విషజ్వరాలు విజృంభిస్తున్నా వైద్యాధికారులు హెల్త్ క్యాంప్‌లు నిర్వహించిన దాఖలాలు లేవని విమర్శించారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ నాయకులు కొన్నె లక్ష్మయ్య, కురాకుల బాబురావు, మెడిపల్లి రమణయ్య పాల్గొన్నారు.

గడువులోగా ఈ పంట నమోదు చేసుకోండి


సమ్మెటవారిగూడెంలో ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ పాషా

చింతలపూడి: జిల్లాలోని ప్రతి రైతు గడువులోగా తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ పాషా పిలుపునిచ్చారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లోని చింతలపూడి మండలం చింతలపూడి, మల్లాయగూడెం, సమ్మెటవారిగూడెం, లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం, కలరాయనగూడెం, అయ్యపురాజుగూడెం, ములగలంపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ పంట నమోదు కోసం రైతులు తమ తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి అవసరమైన పత్రాలను అందజేయాలని చెప్పారు. ఈ పంట నమోదుకు రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం వీఏఏకి అందజేసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ పంట నమోదు చేసుకోవడానికి సెప్టెంబర్ 15 ఆఖరు తేదీ అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలన్నా, పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం పొందాలన్నా ఈ పంట నమోదు తప్పనిసరి అని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జులు వాస్తవ సాగుదారులను మాత్రమే నమోదు చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న కౌలు రైతులు అందరికీ అవసరమైన కౌలు కార్డులు అందచేయడానికి సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చింతలపూడి ఏడీ బి నాగకుమార్, ఏఓ మీనాకుమారి, ఎంఏఓలు, వీఏఏలు , రైతులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పంపిణీ విధానంపై పరిశీలన


ఉచిత ఇసుక పంపిణీని విధానాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

కుక్కునూరు: ఉచిత ఇసుక పంపిణీని విధానాన్ని శనివారం పోలవరం డీఎస్పీ ఎం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ పెద్దిరాజుతో కలిసి పర్యవేక్షించారు. మండలంలోని రీచ్‌ల నుంచి ప్రభుత్వం ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభించిన తరువాత గతంలో కొందరు అక్రమార్కులు ఇక్కడ ఇసుకను తెలంగాణకు తరలించారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదు అందుకున్న ఉన్నతాధికారులు తెలంగాణకు తరలిస్తున్న లారీలను పట్టుకొని కేసులు నమోదు చేశారు. అంతేకాక ఈసారి అవకతవకలు జరగకుండా పటిష్ఠంగా పంపిణీ జరిగేలా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అవకతవకలు జరగకుండా అటు రెవెన్యూ, ఇటు పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే శనివారం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రమేష్, తహసీల్దార్ పెద్దరాజుతో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు.

మోతాదు మించితే పంటలకు నష్టం


రాఘవాపురం పొలంబడి కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

చింతలపూడి: మితిమీరిన పురుగుమందుల వాడకం వలన పంటలకు తీవ్ర హాని కలుగుతుందని మండల వ్యవసాయాధికారి కె మీనాకుమారి సూచించారు. రాఘవాపురం గ్రామంలో శనివారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టులపై బొమ్మలను చూపించి రైతులకు పురుగుమందుల వలన కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. అవసరం మేరకు మాత్రమే పురుగుమందులను వినియోగించాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. పంటలపై ఉన్న చీడ పీడలను గుర్తించి రైతులకు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సీహెచ్ శివకుమార్, వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో భారీ వర్షం


పోలవరంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరంలో శనివారం భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజానీకం ఒక్కసారిగా ఊరట చెందారు. ఉదయం నుంచి విడతలు విడతలుగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రధాన రోడ్డు మార్గాలు, వీధుల్లో వర్షం నీరు ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచిపోయింది. పాఠశాలల ఆవరణలో కూడా వర్షం నీరు చేరుకుంది. వర్షం ప్రభావంతో రోడ్లపై జనసంచారం అంతంత మాత్రంగానే ఉంది.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

- పోలవరం జెడ్పీ హైస్కూల్‌లో చెట్టు కిందే సైకిల్ పార్కింగ్
- తరచూ మరమ్మతులకు గురవుతున్న సైకిళ్లు
- సైకిల్ షెడ్డు నిర్మించాలని మొరపెట్టుకుంటున్న విద్యార్థులు


పోలవరం ఉన్నత పాఠశాలలో చెట్టు కింద సైకిళ్లు పార్క్ చేసిన దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైకిల్ షెడ్డు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా పాఠశాలను సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు సైకిల్ షెడ్డు నిర్మించాలని అనేక పర్యాయాలు విద్యార్థులు వారి దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ షెడ్డు నిర్మాణం మాత్రం చేపట్టలేదు. పాఠశాల ఆవరణలోని చెట్ల కింద విద్యార్థులు సైకిళ్లను ఉంచుతున్నారు. దీంతో ఎండకు ఎండి, వర్షానికి తడుస్తూ సైకిళ్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో కనీసం సైకిల్ షెడ్డు నిర్మాణం కూడా చేపట్టకపోవడంతో విద్యార్థుల తల్లితండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల నూతన భవనాలకు నిధులు మంజూరవుతున్నాయని, సైకిల్ షెడ్డు నిర్మాణానికి మాత్రం నిధులు మంజూరు కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి విద్యార్థుల సైకిళ్లకు నీడ నిచ్చేందుకు షెడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని చింతాలమ్మ ఆలయం

- నాలుగు దశాబ్దాలుగా శాశ్వత ఆలయ నిర్మాణం కోసం ఎదురుచూపులు
- ఇప్పటివరకు పాలకవర్గమే లేని వైనం
- ఆధిపత్య పోరు కోసమే రాజకీయ నేతల ఆరాటమని విమర్శలు



కొయ్యలగూడెం శ్రీ చింతాలమ్మ అమ్మవారి మందిరం. గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ తల్లి

కొయ్యలగూడెం: రాజకీయ పాగా కోసం నాయకులు జరిపే పోరులో అమ్మవారి నూతన ఆలయానికి జాగా లేకుండా పోయింది. కొయ్యలగూడెం గ్రామ దేవత, ముప్పైవేల మంది జనాభాకి ఇలవేల్పుగా భాసిల్లే శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ప్రజలు నాలుగు దశాబ్దాల నుంచి ఎదురుచూస్తున్నారు. సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన మందిరంలోనే అమ్మవారికి నిత్య పూజలు కొనసాగుతూ వస్తున్నాయి. అమ్మవారికి అరకోటి రూపాయల మూలధనం ఉన్నప్పటికీ ఆలయ అభివృద్ధికి నోచుకోకపోవడం భక్తులను తీవ్రంగా కలచి వేస్తోంది. అమ్మవారి ఆలయ వ్యవహారాన్ని రైతు సంఘం ఆధ్వర్యంలో సభ్యులు చూస్తుంటారు. అయితే పాలక మండలి ఏర్పాటు చేయాలని కొద్ది సంవత్సరాల నుంచి సమావేశాలు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఇప్పటివరకు పాలకమండలిని ఏర్పాటు చేసుకోలేదు. కేవలం రాజకీయ నేపథ్యంలో నాయకులు తమ ఆధిపత్య పోరును చూపించుకోవడానికి ప్రయత్నిస్తున్నారే కానీ అమ్మవారికి పూర్తిస్థాయి శాశ్వత ఆలయ నిర్మాణానికి ప్రయత్నించడం లేదనేది భక్తుల మనోగతం. కరవమంటే కప్పకి కోపం వదలమంటే పాముకి కోపం అన్న విధంగా ఇక్కడ నాయకుల తీరు ఉంది. దీంతో ఆలయ నిర్మాణం చేసి తీరాలి అనే గొంతుకలే వినిపించడం లేదు అంటూ మహిళా భక్తులు ఆవేదన చెందుతున్నారు. చింతలు తీర్చే చింతాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సుమారు యాభై లక్షల రూపాయలకు పైగా ఉన్న అమ్మవారి మూలధనాన్ని కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత అకౌంట్లో డిపాజిట్ చేసుకొని ఉన్నారు. ఇందులో కొందరు ఆలయ నిర్మాణం కోసం ముందుకు వస్తుంటే మరికొందరు నిమ్మకుండి పోతున్నారు. అమ్మవారి ఆలయ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని కొనుగోలు చేసి పనులు ప్రారంభిస్తే లక్షలాది రూపాయల విరాళాలను అందించడానికి తాము సుముఖంగా ఉన్నామని దాతలు పేర్కొంటున్నారు. అయితే అందుకు పూనుకోకుండా ఆలయానికి చెందిన కొందరు పెద్దలే సైంధవుల్లా ఆలయ నిర్మాణంలో తమ పాత్రలతో అడ్డుకట్ట పోషిస్తున్నారని విమర్శలుగా వినిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ప్రత్యేక వేడుకలను నిర్వహించేందుకు ప్రస్తుత ప్రదేశం ఇరుకుగా ఉండడం వలన ఉత్సవాల నిర్వహణకు అడ్డంకిగా ఉందని భక్తులు పేర్కొంటున్నారు. అదేవిధంగా అమ్మవారి మెట్టినిల్లు ఆలయంగా అంకాల చెరువు గట్టుపై ఉన్న ఆలయాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. రాజకీయ వైషమ్యాలు వదిలి ఆలయ అభివృద్ధికి కృషిచేయాలని విన్నవిస్తున్నారు.

శంకుస్థాపన చేస్తే విరాళాలు అవే వస్తాయి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రెండవ అతిపెద్ద మేజర్ పంచాయతీలో (పరింపూడి) అమ్మవారి ఖ్యాతికి తగ్గ ఆలయ నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే చాలు విరాళాల వెల్లువ మొదలవుతుంది. అమ్మవారి మూలధనాన్ని ముట్టనవసరం కూడా రాకపోవచ్చు.

– ముప్పిడి విజయకుమారి సర్పంచ్, పరింపూడి

శాశ్వత ఆలయాన్ని నిర్మించాలి



కొన్నేళ్లుగా శాశ్వత ఆలయ నిర్మాణం అంశం తీవ్ర చర్చనీయాంశంగా ఉంది. 2031 సంవత్సరంలో అమ్మవారి జాతర మహోత్సవం రానుంది. ఆలయానికి అంకురార్పణ చేస్తే జాతర నిర్వహణ సమయానికి ఆలయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందగలదు.

– గొలిశెట్టి ప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యుడు